క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయంలో వేకువ జామున నుంచి వేద పండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు గావించారు. ఆలయ ప్రాంగణంలో మహా గణపతి, నాగదేవతలు, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై. బాల నాగిరెడ్డి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. వారిని ఆయన కమిటీ పెద్దలు శాలువా పూలమాలలు వేసి సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మాన్వి వెంకటేష్, లంకారెడ్డి, ఉసేని, గట్టు భీముడు, ఈరన్న, నరసింహులు, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరుటౌన్: ఎస్‌డీపీఐ ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజవర్గ నూతన కమిటీ అధ్యక్షుడిగా హుసేన్‌ను ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలో జరిగిన ఎస్‌డీపీఐ నూతన కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా హఫీజ్ జహీర్ సాబ్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుస్ షకూర్, కార్యదర్శిగా నూర్ అహమ్మద్, కోశాధికారిగా ఖలీల్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలూరుకు చెందిన అబ్దుల్ హమీద్, అబ్దుల్ సుభాన్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

ఇంటింటికీ బియ్యం సరఫరా చేయాలి

కోసిగి: ప్రజలకు అందించే రేషన్ బియ్యంను ఎండీయూ ఆపరేటర్ ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రేషన్ దుకాణాలు వద్ద వెళ్లి గంటల కొద్ది వేచి ఉండి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఎండీయూ ఆపరేటర్లతో ట్రక్కుల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం అందించేవారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా నే ప్రజలకు రేషన్ బియ్యం అందించాలని కోరారు.

యురేనియం తవ్వకాలు వద్దు

ఎమ్మిగనూరుటౌన్: దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో యురేనియం కోసం తవ్వకాలు చేపట్టి అక్కడి ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని జైభీమ్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య కోరారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే యురేనియం తవ్వకాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు.

విద్యా రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ దామోదర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న విద్యా రుణాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని సిద్దార్థ డిగ్రీకళాశాలలో ఆర్‌బీఐ సౌజన్యంతో సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యా రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటల్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, జన్‌ధన్, ఇన్సూరెన్స్ పాలసీలు, విద్యాలక్ష్మి, బ్యాంక్ విద్యారుణాలు తదితర పథకాలను వివరించారు. విద్యార్థుల ప్రయోజనాల కొరకు ప్రారంభించబడిన వెబ్ పోర్టల్, వివిధ బ్యాంకుల విద్యా రుణ పథకాలపై సమాచారం తెలిపే పోర్టల్‌లో అనేక బ్యాంకులకు ఒకేసారి దరఖాస్తు చేయవచ్చన్నారు. సదస్సులో రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, వెంకటేష్, ఎస్‌బీఐ గోపికృష్ణ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

నందవరం : మండలంలో బెల్ట్‌షాపులు తొలగించాలని టీడీపీ మండల నాయకుడు, నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బెల్ట్‌షాపు తొలగించాలని ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. బెల్ట్‌షాపు తొలగించాలని అధికారులు విన్నవించిన చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు.

అన్ని తరగతులకూ ఒకే పాఠం

- ఓబుళపురం పాఠశాలలో ఐదు తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడు
- అందరికీ ఒకే గదిలో పాఠాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు
- పిల్లలకు సరైన విద్య అందడం లేదని తల్లిదండ్రుల ఆవేదన



తాళం వేసిన గది



విద్యార్థులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

కౌతాళం: మండల పరిధిలోని ఓబుళపురం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఐదు తరగతులకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు అంతా కలిసి ఒకే గదిలో ఉండటంతో గందర గోళంగా ఉంటుంది. దీంతో తమ పిల్లలకు సరైన విద్య అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాఠశాలకు ఉపాధ్యాయులు నియమించాలని ఆందోళన చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ గ్రామ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

98 మందికి ఒక్కరే బోధకుడు

మండలంలోని ఉరుకుంద గ్రామానికి మజరా గ్రామం అయిన ఓబుళపురం గ్రామంలోని పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 98 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు హెచ్‌ఎంతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంది. అయితే ఉపాధ్యాయుల కొరత కారణంగా ఒక్క ఉపాధ్యాయుడు షేక్షావలి మాత్రమే ఉన్నారు. ఈయనే ఐదు తరగతులకు బోధించాల్సి వస్తోంది. పిల్లలందరినీ ఒకే గదిలో కూర్చోబెట్టాల్సి రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఇరుకైన గదిలో విద్యార్థులందరూ అవస్థలు పడుతున్నారు. ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతుండగా ఏ తరగతికి చెబుతున్నారో తెలియని పరిస్థితి. అవసరం లేకున్నా ఒకే పాఠం అన్ని తరగతుల విద్యార్థులు వినాల్సి వస్తోంది.

గదులు ఉన్నా నిరుపయోగం..

గత 40సంవత్సరాల క్రితం కట్టిన పాఠశాల గదితో పాటు మారెమ్మ దేవాలయం వద్ద అదనపు గది కట్టారు. దీనికి తోడు గ్రామ ముఖద్వారం వద్ద మరో అదనపు గది ఉంది. ఈ మూడు గదులు విద్యార్థులకు సౌలభ్యం కోసం ప్రభుత్వం నిర్మించింది. అయితే విద్యార్థులందరినీ ఒకే చోట కూర్చోబెట్టి ఐదు తరగతులకు పాఠాలు చెప్పాల్సి రావడంతో గ్రామ ముఖద్వారంలో ఉన్న గదికి తాళం వేశారు. గుడి పక్కన ఉన్న గదిలో వంటలు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇక పాత తరగతి గది భవనంలోనే పాఠాలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు సరిపడా డెస్క్‌లు అందజేసినా వినియోగించుకునే వీలులేక వాటిని మూలన పెట్టేశారు.

ఉపాధ్యాయుడికీ ఇబ్బందే...

పాఠశాలకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో పిల్లలందరినీ అదుపు చేయడం కష్టంగా మారుతోంది. కొన్ని సమయాల్లో ఎవరికి పాఠం చెప్పాలో అయోమయ పరిస్థితి ఉంటుంది. ఏ తరగతికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఈయన సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఒకవేళ సెలవు అవసరమైతే రెండు రోజుల ముందుగానే ఎంఈఓకు దరఖాస్తు చేసుకుంటే, వేరే పాఠశాల ఉపాధ్యాయుడిని పంపుతారు. ఏవైనా శిక్షణ, మీటింగ్‌లు ఉంటే వెళ్లే అవకాశంకూడా లేదు. పైగా అత్యవసరమై సెలవు తీసుకోవాలంటే పాఠశాలకు తాళం వేయాల్సిందే.

ఉపాధ్యాయుల కొరత ఉంది

263 మండలంలో 131 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉండటంతో సర్దుబాటు చేశాం. ఉరుకుంద ఎస్‌డబ్ల్యూ పాఠశాల, చూడి, కుంబళనూరు క్యాంపు -2కు ఉపాధ్యాయులు లేకపోయినా వేరే పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై పంపించి పాఠశాలు చెప్పిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– శోభారాణి, ఎంఈఓ

ఒకే ఒక్క ఉపాధ్యాయుడు



ఐదు తరగతులు చెప్పడానికి ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉన్నారు. తమ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తే పూర్తిగా పాఠాలు అందుతాయి. లేకుంటే ఉన్నత చదువులు ఎలా చదవాలి.

–వీరేశమ్మ, 5వ తరగతి

ఒకే గదిలో అందరం చదువుకుంటున్నాం



తరగతి గదులు మూడు ఉన్న ఒకే తరగతి గదిలో చదువుకుంటున్నాం. ఉపాధ్యాయులు లేక ఇలాంటి సమస్య వచ్చింది. మా కోసం ఉపాధ్యాయులనుమిస్తే అప్పుడు అన్ని గదుల్లో కూర్చొని పాఠాలు వింటాం.

–శివ, 3వ తరగతి

ఎవరికి ఏమీ అర్థం కావడంలేదు



మాకు చదువు బాగా రావాలంటే అన్ని తరగతులకు ఉపాధ్యాయులు కావాలి. అప్పుడే మాకు చదువు బాగా వస్తుంది. ఒకే గదిలో ఐదు తరగతులు ఉండడంతో ఎవరికి ఏమి చెబుతారో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయుల్ని నియమించాలి.

–పల్లవి, 3వ తరగతి

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌లు వేణుసూర్య, డీఎల్‌డీపీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహాన్ని మార్చాలి

ఆదోని సెంట్రల్: పట్టణం శివారులో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. భవనం పై కప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయన్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు శశిధర్, రాజు, గణేష్, యశ్వంత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్ష సాధింపు



ఎంపీడీఓను కలిసి మాట్లాడుతున్న ఆదోని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు

ఆదోని రూరల్: ఇన్‌చార్జ్ ఏపీఓ ఖాలిక్‌బాషా, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ కూటమి నాయకుల ఒత్తిళ్ల మేరకు తమపై వైఎస్సార్‌సీపీ వారు అనే ముద్ర వేసి అత్యుత్సాహం చూపుతున్నారన్నారని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోని మండలంలోని 37 గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదోని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు జాలిమంచి రామాంజనేయులు, ఆరేకల్ గోపాల్, కార్యదర్శి కపటి చంద్రశేఖర్ మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించినట్లు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని, ఎక్కడా లేని విధంగా కేవలం ఆదోని మండలంలో మాత్రం డిమాండ్, మస్టర్లు ఇవ్వకుండా, ఆఫీసుకు రానివ్వకుండా చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి సంబంధించిన నాయకులు చెప్పిన వారికే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను కట్టబెట్టేందుకే అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మస్టర్లు ఇవ్వకపోతే తమ ఆధ్వర్యంలో పనిచేసిన కూలీల హాజరు ఎలా వేయాలని, పని చేసిన వారి పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రామాంజనేయులు, వీరేష్, జయరామిరెడ్డి, వెంకటేష్, రఘు, మహేష్, నాగరాజు, ఈరన్న, బాలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు కె.లక్ష్మిరెడ్డి

ఆదోని రూరల్: ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీల్లో ఒకటైన పెట్టుబడి సాయం రూ.20 వేలను అందించాలని రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మిరెడ్డి, బసాపురం గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని 104బసాపురం గ్రామంలోని సచివాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ఈనెల 11న ఆదోని మండల కార్యాలయం ఎదుట రైతులతో మమేకమై రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుడిసె ఈరన్న, కాటే భీమన్న, మండల నాయకులు అంజిగౌడ్, కె.రమేష్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పట్టుబడిన మద్యం, నిందితులను చూపుతున్న ఎస్ఐ మహేష్‌కుమార్

ఆదోని రూరల్: మండల పరిధిలోని మాంత్రికి గ్రామ సమీపంలో సోమవారం కురువ హుసేనప్ప, గిరిబాబు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ విలేకరులకు తెలిపారు. నిందితులు మోటార్ సైకిల్‌పై 12 బాక్సుల (1152 టెట్రా ప్యాకెట్లు)ను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందన్నారు. అలాగే బోయ శివ అనే వ్యక్తికి కూడా కర్ణాటక మద్యం సరఫరాలో ప్రమేయం ఉందని తెలిసి కడితోట గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

'అన్నదాత సుఖీభవ' అమలు చేయాలి



నందవరంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నందవరం: కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సచివాలయం-1 ఆవరణలో ఏపీ రైతు సంఘం నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా రైతులను ఆదుకోలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలో రూ.20 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నియోజకవర్గ కార్యదర్శి శాంతప్ప, నాయకులు విజయ్‌కుమార్, ఆంజనేయులు, ముని, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయానికి గండి

- ఉరుకుంద ఆలయంలో టిక్కెట్టు లేకుండానే వాహనాలకు పూజలు
- డబ్బులు ఇవ్వకపోతే భక్తులతో సిబ్బంది దురుసు ప్రవర్తన



అర్చకుడు, ఆలయ సిబ్బందితో వాదనకు దిగిన భక్తుడు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తులతో కొంతమంది సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. ఎవరైనా కొత్తగా ద్విచక్ర, భారీ వాహనాలు తేస్తే ముందుగా స్వామి వారి వద్ద పూజలు చేయించడం ఇక్కడ అనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం హోళగుంద మండలం పెద్ద గొనెహాళకు చెందిన భక్తుడు శ్రీనివాసులు కొత్త ద్విచక్ర వాహనం తీసుకోచ్చాడు. స్వామి సన్నిధిలో వాహనానికి పూజ చేయించాలనుకుని వస్తే చేదు అనుభవం ఎదురైంది. ఆలయం వద్ద వాహన పూజకు రూ.25 టిక్కెట్ చెల్లించి పూజ చేయించాలి, అయితే సదరు భక్తుడికి విషయం తెలియక నేరుగా అర్చకుడి వద్దకు వెళ్లి పూజ చేయాలని కోరాడు. అయితే పూజచేసిన తర్వాత రూ.216 దక్షిణ ఇవ్వాలని ఆ అర్చకుడు డిమాండు చేశాడు. ఇదేమిటని భక్తుడు వాహన పూజకు రూ.25 ఉందని తాను టిక్కెట్ తీసుకోక పోవడంతో పూజ చేసినందుకు రూ.100ఇస్తానని తెలిపాడు. దీంతో ఆగ్రహించిన అర్చకుడు భక్తుడిపై బూతులు తిడుతూ దురుసుగా ప్రవర్తించాడు. తనకు జరిగిన అవమానంపై భక్తుడు కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఆలయ అధికారులు అర్చకుడి వద్దకు వెళ్లి జరిగిన ఘటపై విచారిస్తుండగా అక్కడికి వచ్చిన భక్తుడిని చూసి మరోసారి అర్చకుడు ఆగ్రహించాడు. దీంతో మిగతా భక్తులు కూడా అర్చకుడి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వారు దేవాలయం విధులు నిర్వహిస్తే దేవాలయానికి వచ్చే భక్తులకు అవమానాలు తప్పవని కొందరు భక్తులు చర్చించుకుంటున్నారు.

అర్చకుల జేబులోకే..

దేవాలయానికి ఆదాయాన్ని చేకూర్చే వనరుల్లో ఒకటైన వాహనం పూజకు తప్పక టిక్కెట్ ఇవ్వాల్సి ఉండగా చాలా మందికి భక్తులకు ఈ విషయం తెలియదు. ఈ విషయాన్ని సిబ్బంది కూడా చెప్పక పోవడంతో దేవాలయం వద్ద వాహనాలు నిలబడితే అర్చకులు పూజలు చేస్తున్నారు. పూజ తర్వాత భక్తులు సమర్పించే డబ్బులు వారి జేబుల్లోకే వెళ్తోంది. ఇది గత కొన్ని సంవత్సరాల నుంచి జరుగుతున్న తతంగమే. ఇకనైనా అధికారులు స్పందించి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా సమన్వయంతో సిబ్బంది పనిచేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

నందవరం : రబీ సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కందిలో ప్రస్తుతం గూడు పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు మొదటి పిచికారీలో వేప నూనె 10,000 పీపీఎం 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండవ దశలో నోవలూర్యాన్, మూడవ దశలో స్పైనోసాడ్ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే మిరపలో జెమిని వైరస్ నివారణకు నీలం, పసుపు, తెలుపు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వవనరుల కేంద్రం ఏఓ శశిధర్, మండల ఏఓ మర్రి స్రవంతి పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆలయ ఆవరణలో ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తా రు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకా లు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించా రు. కార్తీక దీపాలను వెలిగించి భక్తులు భక్తిని చాటుకున్నారు.

ఈరన్నస్వామి సన్నిధిలో ప్రదీప్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఎంపీటీసీ మూకన్న, నాయకులు వడ్డెరాము, తాహెర్, వెంకటరామిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

వ్యవసాయభూముల్లో లేఅవుట్లు

- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే ప్లాట్ల అమ్మకాలు
- పంచాయతీ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- నోటీసులిచ్చినా పట్టించుకోని రియల్టర్లు
- మోసపోతున్న అమాయక ప్రజలు



గోనెగండ్లలో ప్రధాన రహదారి పక్కన అక్రమంగా వేసిన లేఅవుట్

గోనెగండ్ల : మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా రోజురోజుకు పుట్టుకొస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవసాయ భూముల్లో లేఅవుట్లు వేసి ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా రియల్టర్లు వ్యవసాయ భూమిని ప్లాట్లుగా వేసి అమ్మేసి సొమ్ము చేసుకొంటున్నారు. నిబంధనలు గాలికి వదిలి భూమికి ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ అప్రూవల్ లేకుండానే లేఅవుట్లు వేస్తున్నారు. వారి లాభాలకోసం అడ్డదారులు తొక్కు తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నోటీసులు బేఖాతర్

మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీ సమీపం ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారి పక్కన 554/ఏలో 43 సెంట్లలో అక్రమ లేఅవుట్లు వేశారు. ఈ సర్వే నెంబర్‌లో అనుమతులు లేకుండా లే అవుట్ వేయరాదని రియల్టర్లకు అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ.. వారి ఆదేశాలను బేఖాతారు చేసి సోమవారం లేఅవుట్ పనులను చేపట్టారు. అలాగే మండలంలో గోనెగండ్ల తదితర ప్రాంతాల్లో అనుమతులు లేని లే అవుట్లు వేస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. దీంతో పంచాయతీలకు రావాల్సిన ఆదాయం గండిపడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులున్నాయి. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తున్న రియల్టర్ల వద్ద సంబంధిత అధికారులు లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అక్రమ లేఅవుట్లను అడ్డుకుంటాం



ప్రభుత్వ అనుమతిలేకుండా లేఅవుట్లు వేస్తే అడ్డుకుంటాం. ప్రస్తుతం గోనెగండ్లలో ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిలో వేసిన లే అవుట్ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఆ రియల్టర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తే సంబంధిత రియల్టర్లపై చర్యలు తీసుకుంటాం.

– సతీష్, ఇన్‌చార్జ్ ఈఓ, గోనెగండ్ల

సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల: మిరప, మొక్కజొన్న, పత్తి, కంది పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో ఏఓ హేమలత, డీఆర్‌సీ వ్యవసాయ అధికారులు శశిధర్ రెడ్డి, మధుమతి ఆధ్వర్యంలో రైతులు, రైతు సేవా సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మిరపలో వైరస్ తెగులుకు కారణమైన తిక్క అలుము లేదా పార్థీనియం కలుపు మొక్కను పొలంగట్ల చుట్టూ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఎకరానికి 20 పసుపు పచ్చ జిగురు అట్టలు, 20 నీలిరంగు అట్టలు అమర్చుకోవాలని సూచించారు. ఈ మధ్య కొమ్మ ఎండు తెగులు ఆశించడం గమనించామని, దీని నివారణకు డిఫెన్‌కొనాజోన్ 1మిల్లీ లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పత్తిలో మేజెం జియం ధాతు లోప నివారణ గూర్చి వివరించారు.